అమ్మ కొట్టిందని
అలిగివెళ్లిపోయిన
ఆ చిన్నారి
గ్రహించిన నిజం?

# అమ్మకొట్టిందా!

సాహితి
కథ

గుమ్మాడమ్మా గుమ్మాడని పాడుతూ తన కాళ్లమీద గుమ్మాడూగుతూ పెరిగి—

చిన్ని పింక్ కలర్ షిమ్మీ వేసుకుని గుండ్రంగా తిరుగుతూ 'రింగారింగా రోజెస్' అని పాడుతూ పెద్దదై—

సుస్మిత యింతదౌతుందనిగానీ తననే ఎదిరిస్తుందనిగాని వుత్పల వూహించలేదు.

మనసుని సమాధానపరచుకోలేని వాళ్లే ఎదురు ప్రశ్నలు వేస్తారు. సుస్మితలో కాస్తంత జిజ్ఞాస యెక్కువ. అదా వయసు పిల్లల్లో సహజంగా వుండాల్సిన దానికంటే తన కూతుర్లో చాలా యెక్కువగా వుందనుకుంటుంది వుత్పల. ప్రతీ తల్లీ అనుకునేలావే తనూ అనుకుంటోందని ఆమెకి తెలీదు.

ముందురోజు వెళ్ళొచ్చిన సినిమాల్లోని పాట సన్నగా హమ్ చేస్తూ ఏదో పని చేసుకుంటోంది వుత్పల.

"మమ్మీ!" సందిగ్ధంగా పిలిచింది సుస్మిత.

"ఏమంటమ్మా? చేస్తున్న పనాపి అడిగింది. సుస్మితలో ఏదో తెలుసుకోవాలన్న జిజ్ఞాస. తను చూస్తున్న రెండు విషయాలకి పొంతన సరిగ్గా కుదరనపుడు కలిగేలాంటి అసహనం.

"మమ్మీ... మరి సినిమాల్లో పాటలు పాడేటప్పుడు గౌన్లు, మిడీలు, పెట్టీకోట్లు వేసుకుంటారు... నువ్వు నువ్వలా పాడవేం?–" ఆ పిల్ల వేసిన ఆ ఒక్క ప్రశ్నా పిడుగులాంటిది.

ఉత్పలకి నిలుగుడ్లు పడ్డాయి. ఈ చెవినుంచీ ఆ చెవిదాకా గడ్డం నుంచీ



మదుటిదాకా ముఖం ఎర్రబడింది. ముందు గదిలో కూర్చుని పేపరు చదువుతున్న సుధీర్ కొద్దిగా పేపరు వత్తిగించి చూసాడు. కూతురి ప్రశ్నకి షాక్‌తోపాటు భార్యేం

జవాబు చెప్తుందో వినాలన్న కుతూహల కూడా కలిగిందతనికి. ఇంచుమించుగా ఇ లాంటి ప్రశ్నల్ని తన ఫ్రెండ్స్ సర్కి చాలామంది ఎదుర్కొన్నామని చెప్పారు.

ఇప్పుడు తన వంతు. వినాలి, వుత్పలేం చెప్తుందో?

కూతురికి సమాధానం చెప్పగలిగే శక్తి సంపాదించడానికి ఉత్పలకి చాల సమయం పట్టింది. ఇంతలో తన చిన్నతనంలో జరిగిన ఓ సంఘటన గుర్తొచ్చింది.

ఉత్పలకి వూహ తెలిసి ఎప్పుడూ ఆమె తల్లి ముడే చుట్టుకునేది. "అమ్మా! అల్ల సినిమాలో జమునలా యింత పొడుగు జడేసుకుని పూలెందుకు పెట్టుకోవే?" అన డిగింది కుతూహలంగా. దానికామె తల్లి బోల్డు సిగ్గుపడిపోయింది. దాన్ని కప్పిపుచ్చు కుందుకు అయోమయపు నవ్వొకటి నవ్వేసి "పోవే, నీ ప్రశ్నలూ నువ్వూను" అంది. తండ్రి అక్కడే వున్నాడు. ఏదో పనున్నట్టు లేచి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. బామ్మ వుందక్కడ. పడీపడీ నవ్వింది తన ప్రశ్నకి. "మీ అమ్మకి వాల్జెడేస్తావటే పిల్లా? నలుగురు పిల్లల తల్లయాక వాల్జెడేమిటే, మీ సినిమాల ని తగలబెట్టా!" అంది.

ఆ రోజుని తన తల్లికూడా యింత యిబ్బంది పడుంటుందా తన ప్రశ్నకి? ఉండదనిపించింది వుత్పలకి. తను తన తల్లిని కాస్తంత షోకులు చేసుకోమందంతే. కానీ తన కూతురు తనని చాలీచాలని బట్టలేసుకుని పాటలెందుకు పాడవూ అనడు గుతోంది. పైపైని ఆలోచిస్తే సమస్య అంత జటిలమైనది కాదు. సినిమా పోకళ్ళని కొట్టి పారెయ్యచ్చు. కాస్త డీప్‌గా ఆలోచిస్తే... తన తల్లికి వాల్జెడ వేసుకోవడం అనుచితంగా తోచింది. తనకాలం వచ్చేసరికి ముప్ఫై అయిదేళ్ళొచ్చాక కూడా పిలక వేళ్ళాడేసుకుని తిరుగుతోంది. చాలీచాలని గుడ్డలేసుకుని తిరగడం తనకి తప్పనిపిస్తోంది. తరువాతి తరంవాళ్ళకది ఫేసినేటింగ్‌గా వుంది. ఈ పరంపర ఎందాకా వెళ్తుంది?

ఇంక ఆలోచించదలచుకోలేదు వుత్పల. కూతురికేదో జవాబు చెప్పాలని మాత్రం నిర్ణయించుకుంది. "సుస్మీ!" నాందిగా అంది. అవతలి గదిలో వున్న సుధీర్ ఎలర్టయ్యాడు.

"మనం ఎన్నోసార్లు పార్కుకెళ్ళాం. అక్కడెవరేనా పాటలు పాడుకుంటూ గెంతే వాళ్ళు కనిపించారా? అవి సినిమాలు. సినిమా ల్లో వాళ్ళలా వుంటేనే అందరూ సినిమాలు చూస్తారు. ఎక్కువమంది సినిమాలు చూస్తే బోల్డు డబ్బులొస్తాయి. మనం అలావుంటే అంతా నవ్వుతారు" క్లుప్తంగా అంది.

సుస్మిత కర్థమైందో లేదో మరి, యిం ం తర్కించలేదు. తల్లి ముక్తసరిగా జవాబివ్వ డంతో ఆమెకి ఆ టాపిక్ యిష్టం లేదని గ్రహించి వూరుకుంది.

ఆ సంభాషణైతే అక్కడికి ఆగిపోయింది గానీ వుత్పలకి కూతురిమీద మరికాస్త శ్రద్ధ పెరిగింది. సెల్ఫ్‌కాన్షస్‌నెస్ బాగా ఎక్కువైపోయింది. ఏ పనిచేసినా దాన్ని కూతురే విధంగా రిసీవ్ చేసుకుంటుందా అనే కోణంలోంచి చూసి చెయ్యడం అలవాటైంది. టీవీలో వచ్చే పాటల దగ్గర్నుంచి తన సుధీర్‌తో మాట్లాడ్డం దాకా ప్రతిదానిమీదా కూతురి రియాక్షన్ కోసం ఎదురు చూడ్డం తనకి తెలీకుండానే అలవాటైపోయింది వుత్పలకి.

ఇదే విషయాన్ని ఒకసారో డాక్టర్ ఫ్రెండుతో అంటే ఆమె నవ్వి "ఒక్కరే

పిల్లలున్నవాళ్లంతా యింతే వుత్పలా'' నీలానే ఆలోచిస్తారు ఆ పిల్లలు తల్లిదండ్రులకి బాగా క్లోంగౌతుంటారు. ఆడపిల్లయితే అమ్మనీ మగపిల్లాడైతే నాన్ననీ అనుకరిస్తూ వుంటారు వాళ్లలా చేసేసరికి స్ట్రేంజిగా అనిపించి మీరు భయపడతారు'' అని కొట్టి పారేసింది

నిజమే! సుస్మిత తర్వాత మరోపాపో బాబో వుంటే బాగుణ్ణని సుధీర్‌కీ వుత్పలకీ ఎంతగానో అనిపించింది. వాళ్ల ఆందోళన చూసి డాక్టరు కోప్పడింది. "అసలు పిల్లల్లేనివాళ్ల గురించి ఆలోచించు వుత్పలా! పిల్లల కోసం వాళ్లుపడే ఆరాటం, తపన చూస్తే నీకే అనిపిస్తుంది నీ ప్రాబ్లం ఎంత సిల్లీగా వుందో'' అంది.

అప్పట్నుంచీ వుత్పల మనసు సరిపెట్టుకుని సిస్మితే తన జీవితానికి కేంద్రబిందువుగా బతికేస్తోంది.

* * *

సుస్మితకి పదమూడో యేడొచ్చింది. అంటే టీనేజిలో అడుగుపెట్టిందన్నమాట! పిల్లకి వులుకూకులుకూ ఎక్కువయ్యాయి. పువ్వు చుట్టూ తిరిగే భ్రమరంలా అద్దం చుట్టూనే తిరుగుతూ వుంటుంది. పోయి గంటల తరబడి డ్రెస్సింగ్ టేబుల్ ముందు నిల్చుంటుంది. జుత్తు అటు పీక్కుంటుంది, యిటు పీక్కుంటుంది. అందులోని అందం ఏమిటో ఎవరికీ అర్థం కాదు. ఉత్పల చూస్తే కేకలేస్తుంది "అస్తమానూ అద్దం దగ్గిరేం చేస్తున్నావే'' అని.

"మమ్మీ, నువ్వు తెల్లగా వుంటావు. నేనెందుకే యింత నలుపు'' వుత్పల బొట్టు పెట్టుకుంటే పక్కనొచ్చి అద్దంలోకి చూస్తూ అడిగింది. ఇద్దరికీ వున్న తేడా స్పష్టంగా కనిపిస్తోంది.

ఉత్పల గుటక మింగింది.

చిన్నప్పట్నుంచీ సుస్మితకి తను నలుపనే కాంప్లెక్స్ ఎక్కువ. ఆ పిల్ల బుర్రలోకి ఎలా వచ్చిందో తెలీదు. ఇద్దరి చేతులూ పక్క



ఠక్కని పెట్టి చూసుకునేది. పని చేసుకుంటూ చీర కుచ్చెళ్ళు పైకి దోపుకుంటే తల్లి కాళ్లకేసి విస్మయంగా చూసేది.

“చిన్నప్పుడు కొందరు పిల్లలు నల్లగా వుంటారు. పెద్దయి చీరలు కట్టుకుంటే తెల్లబడతారు'' అని సర్దిచెప్పేది వుత్పల. ఆ పిల్ల నమ్మేది. ఇప్పుడల్లా కన్విన్స్ కావటం లేదు.

“తెలుపు నలుపుల్లో అందం వుండదు సుస్మీ. మనం మంచిగా వుంటామనుకో మన మనసు అందంగా వుంటుంది. అటువంటి అందమే మన మొహాల్లో కనిపిస్తుంది. అందుకే చూడు, కొందరు ఎంత తెల్లగా వున్నా బావుండరు. విమలాంటివాళ్ల స్వీటీని చూడు నల్లపిల్ల. ఐనా ముద్దొచ్చి అందరం ఎత్తుకుంటాం'' వుత్పల నచ్చజెప్పింది.

“మమ్మీ పెద్దయ్యాక నాకు నల్లపిల్లలే పుడతారా?'' తపిమని అడిగింది సుస్మిత.

ఉత్పల మ్రాన్పడిపోయింది. తను నలుపన్న భావన ఆ పిల్ల మనసులో ఎంత లోతుగా నాటుకుపోయిందో అర్థమైంది. తనెప్పుడూ సుస్మీ రంగుని కామెంట్ చెయ్యలేదు. తను తెల్లని తెలుపు. భర్త నలుపు. పెళ్లయిన క్రొత్తలో అనిపించేది తను బాగా నలుపని. కానీ యిప్పుడదే అలవాటైపోయింది. పిల్లలకి తన రంగు రాకపోయినా పర్వాలేదు, చామనచాయలో వుంటే చాలనుకుంది. సుస్మీకి బొమ్మ పోలిక వచ్చింది. బాగా నలుపు. ఐనా కళగల ముహం. బ్లాక్ బ్యూటీ. మరెందుకు దానికీ బాధ? స్కూల్లో ఎవరేనా టీజ్ చేస్తున్నారా?

సుస్మితకి ఏదో జవాబు చెప్పి స్కూలుకి పంపించింది. తనూ పనంతా ముగించుకుని స్కూలుకెళ్లి ప్రిన్సిపాల్ని కలిసింది. ఆవిడ చాలా సరళ హృదయురాలు.

“మా సుస్మీని స్కూల్లో ఎవరేనా ఏమైనా అంటున్నారా మేడమ్! తను నలుపని ఒకటే బాధపడుతోంది'' అని వుత్పల అనగానే.

“ఐ విల్ సీ యిన్టు ది మేటర్'' అని వెంటనే ప్రామిస్ చేసింది.

ఆవిడ దృష్టికైతే తీసికెళ్లింది గానీ ఆవిడంత సిన్సియర్గా రియాక్టవుతుందని వుత్పల వూహించలేదు.

స్కూల్ డే నాడు 'మిస్టర్ క్లీన్' నాటకం వేయించింది ప్రిన్సిపాల్ పిల్లల చేత. అందులో ముగ్గురు పిల్లలుంటారు— ఇద్దరు ఆడ, ఒక మగ. ఒక పిల్ల చాలా అందమైనది. దాంతో అహంభావం చాలా ఎక్కువ. మరోపిల్ల చాలా డబ్బుగలది. కానీ ఏబ్రాసి పిల్ల. మూడో పాత్ర మగపిల్లవాడిది. అగ్లీగా వుండే పిల్లవాడి పాత్ర. అతడి పేరు మిస్టర్ క్లీన్. పేరుకి తగ్గట్టు చాలా పరిశుభ్రతని పాటిస్తాడు. ముగ్గురూ క్రిస్మస్ ట్రీని అలంకరించుకుని శాంటాక్లజ్ ఆగమనం కోసం ఎదురు చూస్తుంటారు. క్రిస్మస్ తాత అపరిశుభ్రంగా వుండే పిల్ల దగ్గరకి గానీ ఆర్భాటంగా క్రిస్మస్ ట్రీని అలంకరించిన మొదటి పిల్ల దగ్గిరకి గానీ వెళ్లడు. మిస్టర్ క్లీన్కి మాత్రం అద్భుతమైన బహుమతినిచ్చి వెళ్లిపోతాడు.

పదిహేను నిమిషాల ఈ నాటికని అందరూ వూపిరి బిగబట్టి చూసారు.

అందులోని అందమైన పిల్ల పాత్ర సుస్మి వేసింది. లైట్ల ఎఫెక్టులో ఆ పిల్ల నిజంగా అందంగా వుంది. అద్భుతంగా వుంది.

ఉత్పల మనసు ప్రిన్సిపాల్ పట్ల కృతజ్ఞత తో నిండిపోయింది. ఒక స్టూడెంట్ కోసం అంత ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నందుకు థేంక్స్ చెప్పి వచ్చింది.

"ఉత్తుత్తి థాంక్స్ కాదు. దీంతో మీ బేబీలో ఛేంజి రావాలి" నిండుగా నవ్వుతూ అందావిడ.

నాటిక తర్వాత సుస్మితలో చాలా మార్పొచ్చింది. మిస్టర్ క్లీన్‌లా వుండడం అలవాటు చేసుకుంది. ఉత్పల తేలిగ్గా వూపిరి పీల్చుకుంది.

* * *

సుధీర్ వారంరోజుల్నించీ డెప్యుటేషన్ లో వున్నాడు. ఆవేళే ఆఫీసులో రిజాయిన య్యాడు. మధ్యాహ్నం అయేసరికల్లా వ్రరీడ్ గా యింటికొచ్చాడు. రాగానే భార్య నడిగాడు. "సుస్మీ ఏది?" అని.

"అదేవేళప్పుడు యింట్లో ఎందుకుం టుంది?" వుత్పల ఎదురు ప్రశ్నించింది.

"ఈ వారంరోజులూ నువ్వు దాన్ని స్కూలుకి పంపించలేదా?ఏం? ఎందుకని? కనీసం లీవేనా అప్లయి చెయ్యలేదా? ఈ వేళ స్కూల్నించీ ఫోనొచ్చింది. వంట్లో బాగుండ టం లేదా, వారం రోజుల్నించీ మీ సుస్మిత స్కూలుకి రావడం లేదని వాళ్లడిగేసరికి నేను బ్లాంక్ ఫేస్ పెట్టాను" అన్నాడు.

ఉత్పల నిశ్చేష్టురాలైపోయింది. కనీసం భర్తకి జవాబివ్వాలనికూడా తోచలేదు. సుస్మీ వారం రోజుల్నించీ స్కూలుకి వెళ్లడం లేదా? డ్రెస్ చేసుకుని, బేగ్ టిఫిన్ బాక్సు పట్టుకుని బై చెప్పి ఎక్కడికెళ్తోంది? ఏమైం ది దీనికి? ఎందుకిలా చేస్తోంది? ఆమె కళ్లల్లోంచిధారాపాతంగా కన్నీళ్లుకారిపోయాయి.

ఏదో జరిగిందని సుదీర్‌కి అర్థమైంది. "ఏమైంది వుత్పలా? వాట్ హేపెన్డ్ ఐసే?' ' ఆతృతగా అడిగాడు.

## తిట్లు



"సుబ్బారావు నీవు రోజూ ఆఫీసుకి లేటుగా వస్తావు. ఆఫీసరు ఎన్ని తిట్టినా పట్టించుకోవు ఏమయ్యా" సందేహంగా అడిగాడు అప్పారావు.

"అబ్బే! అవి సాయంత్రం లేటుగా ఇంటికి వెళ్లినపుడు మా ఆవిడ తిట్టే తిట్లలో పావు వాటా ఉండవు" అన్నాడు సుబ్బారావు.

– ఎస్.అప్పలరాజు
(నెల్లిమర్ల)

తవని తను కూడదీసుకుని చెప్పింది వుత్పల. "రోజూ స్కూలుకని చెప్పి కరెక్ట్ టైమ్‌కి వెళ్తోంది. ఎక్కడికెళ్తోందో ఎందు కిలా చేస్తోందో తెలీడం లేదు. రానీండి కనుక్కుంటాను."

ఉత్పల కూతుర్నెంత గారంగా చూస్తుం దో అంత కఠినంగానూ వుండగలదు. సుధీర్‌కది చాతకాదు. సుస్మితని వెంట తిప్పుకోవడం, అడిగినవల్లా కొనివ్వడం తప్ప గట్టిగా కసురుకోవడం కూడా రాదు.

ఎప్పుడేనా ఆ పిల్ల తనదగ్గిర చేరి అల్లరి చేస్తుంటే "ఉత్పలా! ఇది నన్ను విసిగిస్తోంది చూడు" అని భార్యకి కంప్లయింట్ చేస్తాడు. అలాగని భార్య కూతుర్నో దెబ్బవేసినా, నాలుగు కేకలేసినా భరించలేడు.

ఇప్పుడు భార్య కూతుర్ని బాగా దండిస్తు ంది. ఆ సంగతి అతనూహించగలడు. చూసి తను తట్టుకోలేడు. అదీగాక సుస్మీ తననో ఫ్రెండులా భావిస్తుంది. తల్లి కొట్టినపుడు తను రెస్క్యూకి రావాలనుకుంటుంది. ఇది వరకు ఎన్నోసార్లు అలా జరిగింది కూడా. ఇప్పుడు తనలా సుస్మీని వెనకేసుకు రావడం బాగోదు. అలాగని తనుండి చూస్తూ వూరుకుంటే ఆ పిల్ల హర్టవుతుంది. అందు కే తల్లీ కూతుళ్లకి సమస్య వదిలేసి బైటికెళ్లి పోయాడు సుధీర్.

ఎప్పట్లానే స్కూలునుంచి వచ్చినట్టు యింటికొచ్చింది సుస్మిత. అప్పటిదాకా ఏం చెయ్యాలో తోచని బాధతో ఏడుస్తూ కూర్చుంది వుత్పల. కూతుర్ని చూసాక ఆమెలో ఆవేశం తప్ప మరేమీ లేదు.

"ఆగక్కడే" అనరిచింది.

సుస్మితకి అర్థమైంది. తను చేస్తున్న పని తల్లికి తెలిసిపోయిందని ఆమెకేసి ఓసారి చూసి తలొంచుకుని నిల్చుంది. ఆ తలొం చుకోవడంలోనూ నిల్చోవడంలోనూ తప్పు చేసిన భావన లేదు. నిరసన వ్యక్తమౌతోంది. తను చేస్తున్నది తప్పని ఆ పిల్లకి తెలిస్తే కద!

"వారం రోజుల్నించీ స్కూలుకెళ్లటం లేదట. ఎక్కడికెళ్తున్నావు? ఏం చేస్తున్నావు? నీకేం తక్కువ చేసామనే మమ్మల్నిలా ఏడిపిస్తున్నావు? ఎక్కడ తిరిగావే? ఈ బుద్ధులన్నీ నీకు పుట్టినవేనా, ఎవర్నేనా చూసి నేర్చుకుంటున్నావా? చెప్పు. ఎవరు నిన్నిలా చెయ్యమన్నది? చెప్పవే, చెప్పు" కూతురి రెండు భుజాలూ పట్టుకుని వూపేస్తూ అడిగింది వుత్పల. ఆమె మనసు నిండా రకరకాల అనుమానాలు— ఈ పిల్ల చెడు సావాసాలు పట్టిందా— కథల్లోనూ వాటిల్లోనూ చూపించినట్టు ఏ డ్రగ్స్‌కేనా అలవాటు పడుతోందా? సినిమాల్లోలా బాయ్ ఫ్రెండ్స్‌ని వెతుక్కుందా? అని. వీటన్ని టికీ అనుసంధానంగా మరో అనుమానం— యిదంతా తమ పెంపకంలో లోపమేనని. అలాంటి అనుమానాల ఆధారంగా పుట్టుకొచ్చిన ఆవేదనలోంచీ జనించిన కోపం.

తల్లికంత కోపం రావడం సుస్మిత ఎప్పుడూ చూడలేదు. ఐనా భయపడలేదు. మొండిగా నిల్చుంది. ఉత్పలకి వళ్లూపై తెలీలేదు. కన్నూ ముక్కూ చూడకుండా ఎడాపెడా వాయించేసింది.

మౌనంగా దెబ్బలకి వళ్లప్పగించేసింది సుస్మిత.

కొట్టీకొట్టీ అలసిపోయింది వుత్పల.

ఆఖరికి విసిగిపోయి "నిన్ను అమ్మమ్మ దగ్గరికి పంపించేస్తాను. అక్కడే వుందువుగాని. నీకు స్కూలు, చదువు ఏమీ అక్కర్లేదు' ' ఆవేశంతో రొప్పుతూ అంది.

అప్పుడు యిప్పింది సుస్మిత నోరు. "నాకు నీ దగ్గిరకన్నా అమ్మమ్మ దగ్గిరే బాగుంటుంది. నన్నెందుకు కొట్టావసలు? నాకు వీసీపీ కావాలని ఎన్నిసార్లు చెప్పాను? రమ్యావాళ్లూ కొనుక్కున్నారు. ఎంత బాగుందో. రోజూ ప్రతీ కేసెట్స్ వేస్తున్నారు. నేమువాళ్లింటికే వెళ్తున్నాను" అంది పెద్దగా.

ఉత్పల స్థాణువైపోయింది. ఏమిటీపిల్ల మనస్తత్వం? ప్రవృత్తి? ఇదసలు తన కడుపుని పుట్టిన కూతురేనా? టీవీ తనే సంతోషంగా కొంది. వీసీపీ కొనడం తనగ్గానీ భర్తకిగానీ యిష్టంలేదు. తన కూతురు తన అభిరుచుల మేరకి పెరగాలా? లేక కూతురు కొత్తగా ఏర్పరచుకుంటున్న యిష్టాలమేరకి తాము ప్రతిస్పందించాలా? ఏది సబబో కాదో ఆ పిల్లకి చెప్పే హక్కు తమకి లేదా? నిజమే. సుస్మిత వీసీపీ కొనమని ఎన్నోసార్లడిగింది. అడిగినపుడల్లా వద్దని తను నచ్చజెప్తూనే వుంది. ఐనా వీసీపీ అంటే మాటలా? పైగా దాని మెయింటెనెన్స్? ఈ వేళ వీసీపీ అంది. రేపు మరొకటి ఇలా అడిగినవన్నీ కొంటూ వెళ్లేంత స్తోమతు తమకేది? ఐనా, దీనికి వద్దని చెప్పినా ఎందుకీ క్రేజ్? ఎక్కణ్ణుంచీ వచ్చిందో మొండితనం? పైగా తన దగ్గిరకన్నా తన తల్లింట్లో బావుంటుందట. ఎందుకని? తమ్ముడు వీసీపీ కొన్నాడు కనుకనా? అంటే కన్నతల్లి కన్నా దీనికి వీసీపీ ఎక్కువైందా? ఇక్కడ వుత్పన్నమైనది తల్లి ప్రేమతో చెప్పే హితవుకన్నా పై ఆకర్షణలు ఎక్కువయ్యాయా అన్న మౌలికమైన ప్రశ్న. అలాంటి ప్రశ్న పుట్టిందంటే తనకీ సుస్మీకీ మధ్యని కమ్యూనికేషన్ గేప్ ఏర్పడినట్టేగద! ఎలా చెప్తే అర్థమౌతుందీ పిల్లకి? ఎలా బోధపర్చాలీ పిల్లకి రమ్యా వాళ్లకీ తమకీ వున్న స్టేటస్ డిఫరెన్స్?

## చిత్రకారులు

*కళలకు ప్రసిద్ధి చెందిన పారిస్ నగరంలో 40 వేల మందికి పైగా చిత్రకారులు వున్నారు. వారిలో 9 వేల మంది రోడ్లమీద, పేవ్‌మెంట్ల మీద బొమ్మలు, పెయింటింగ్‌లు వేసి జీవిస్తున్నారు. రవీంద్రనాథ్ టాగూర్ తన 70వ ఏట చిత్రాలను వేయటం ప్రారంభించి 10 సం.లలో 3 వేల చిత్రాలను చిత్రించాడు.*

– డాక్టర్ ఆళ్ల



కూతుర్నలాగే వదిలేసి నిశ్శబ్దంగా అక్కణ్ణుంచి వెళ్లిపోయింది వుత్పల— సుస్మిత తల్లి వెనకాల వెళ్లలేదు. మూతి ముడుచుకుని అక్కడే సోఫాలో పడుకుంది. తండ్రి వచ్చేసరికి అలాగే నిద్రలోకి జారుకుంది.

సుధీర్ యింటికొచ్చేసరికి కాస్త చీకటిపడింది. చీకట్లో సోఫాలో ముణగదీసుకుని పడుకున్న సుస్మితని చూడగానే అతని మనసు ఆర్ద్రమైంది. సమయానికి తనింట్లో లేకుండా వెళ్లిపోవడం ఆ పిల్లపట్ల అమానుషమైనదిగా అనిపించింది. కూతురి పక్కని కూర్చుని "సుస్మీ!" అని మృదువుగా పిలిచాడు. దుఃఖంతో అతని గొంతు రుద్ధమైంది.

తండ్రి పిలుపుకి సుస్మిత కళ్లిప్పి చూసింది. మళ్లీ నిద్రలోకి జారుకుంటూ సగం జాగృతీ సగం నిద్రగా వున్న స్థితిలో నిలదీస్తున్నట్టు అడిగింది. "వీసీపీ అడిగానా? మమ్మీ కొనలేదు. రమ్యా వాళ్లింట్లో చూసానని కొట్టింది. ఎందుక్కొట్టాలి చెప్పు డాడీ?"

సుధీర్‌కి సగం అర్థమైంది. మిగిలిన సగం అర్థం కాలేదు. మృదువుగా కూతురి తల నిమిరి భార్య దగ్గిరకెళ్ళాడు. ఇద్దరూ ఒకలానే అనిపిస్తారతనికి ఒక్కొక్కసారి "ఇంట్లో లైట్లేనా వెయ్యకుండా చీకట్లో ఏంటిది?" లైటు వేస్తూ మందలింపుగా అడిగాడు.

ఏడ్చిఏడ్చి వుత్పల ముఖం ఎర్రగా వుబ్బింది. కళ్లు మంకెనపూల్లా అయ్యాయి. "సుస్మీ ఏం చేస్తోంది? పడుకుందా? ఆమె గొంతు భారంగా వుంది.

"పడుకుంది, ఏం జరిగిందసలు?"

ఉత్పల క్లుప్తంగా చెప్పింది.

"బాగా కొట్టావా?" అడగలేక అడిగాడు.

ఆమె బరస్టయింది. ఏం చెయ్యమంటారో చెప్పండి. ఇంతకు ముందు చాలాసార్లడిగింది వీసీపీ కొనమని. నచ్చజెప్పాను. నువ్వు పెద్ద డాక్టరువయ్యాక కొందువుగాని అని. విన్నట్టే వింది. ఎలాంటి పనిచేసిందో చూడండి. ఎవరింట్లోనో కొనుక్కుంటే యిది కన్నతల్లిని నన్ను... నన్ను ఛీట్ చేసి చూడ్డానికి వెళ్తుందా? ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు. ఏడ్రోజులపాటు! ఏం? ఏం తక్కువ చేసామని దానికి? వీసీపీ కొనవంత మాత్రాన నేను దానికి అమ్మని కాకుండా పోయానా? మనింట్లో కంటే మా అమ్మా వాళ్లింట్లోనే బావుంటుందట!" వెక్కిళ్ల మధ్యని అంది.

"ఏమిటిది వుత్పలా? చిన్నపిల్ల. దానికేం తెలుసు? దానికా వీసీపీ మీద మోజుగా వున్నట్టుంది. రేపు లోన్ తీసుకుంటాను. కొందాం" భార్య భుజం చుట్టూ చెయ్యేసి దగ్గరకి తీసుకుంటూ అన్నాడు.

"చాల్లెండి. మీకు మతిలేకపోతే నాకన్నా వుండాలి. తాహతుకి మించిన కోర్కెలు మనిషిని చెడగొడతాయి. ఈ రోజు యిదైంది. రేపింకొకటి. ఐనా వీసీపీ అంటే మాటలా? కొనడం ఒకెత్తు మెంటేనె చెయ్యడం యింకో ఎత్తు. గట్టిగా కట్‌చేస్తే అదే దార్లో పడుతుంది" అంది వుత్పల. ఆమె బెంగ ఆమెది. తమది మధ్యతరగతి కుటుంబం. బాధ్యతల్లేవు కాబట్టే, ఒక్కర్తే సంతానంగాబట్టే నిలదొక్కుకోగలిగారు.


సుస్మిత చూడబోతే ఆడపిల్ల. రూపసి కాదు. చదువులోనూ అంతే! ఏవరేజిగా చదువుతుంది. అలాంటి పిల్లకి పెళ్లి చెయ్యాలంటే మాటలు కాదు. ఎంటర్టైన్‌మెంటుకీ లగ్జరీకి మధ్యని గీతగీస్తూ వెళ్లకపోతే కుదరదు. ఐనా పదమూడేళ్ల పిల్లకి తమ తాహతేంటో తెలీకపోతే ఎలా? దానికి స్వంతంగా తెలీదు. కనీసం తను చెప్పినప్పుడేనా అర్థం చేసుకోవాలి గద! నయాన్న బుజ్జగించి చెప్పింది. వినలేదు. తిట్టోకొట్టో దార్లో పెట్టుకోవల్సిన బాధ్యత తనది కాదా? ఇది నాణానికి ఒకవైపు.

నాణానికి రెండోవైపున అర్థం పట్టేనట్లుంది సుస్మిత మనసు. తను కొనమన్న వీసీపీ కొనకపోగా తల్లి తననెందుకు కొట్టాలి? అనేది ఆమె ప్రశ్న.

రాత్రి ఎవరికీ తిళ్ళు లేవు. సుధీర్ గదిలో పడుకున్నాడు. ఉత్పల మనసొప్పక కూతురి సోఫా పక్కని చాప పరుచుకుని పడుకుంది. అన్ని దెబ్బలు తిని వళ్లు తెలీకుండా పడి నిద్రపోతున్న కూతుర్ని చూస్తుంటే కడుపు తరుక్కుపోయింది. లేపి యిన్ని పాలు పడతామని వంటింట్లోకి వెళ్లి వెచ్చచేసుకొచ్చింది. ఎంత లేపినా సుస్మిత లేలలేదు. నిద్రచేతో అలకచేతో మరి! అదిగో ఆ మొండిపంతమే ఉత్పలకి వచ్చని ది. గ్లాసక్కడే టీపాయ్ మీద పెట్టి మూతపెట్టి చాపమీద వరిగింది. ఎప్పటికో నిద్రలోకి జారుకుంది.

తెల్లవారి పిల్లి పాలగ్లాసు తోసేస్తే ఆ శబ్దానికి మెలకువ వచ్చింది ఉత్పలకి. పక్కకి తిరిగి చూస్తే సోఫాలో సుస్మిత లేదు.

"సుస్మీ!" అని వెయ్యబోయిన కేక ఆమె గొంతులోనే ఆగిపోయింది, ఖాళీగా వున్న సోఫాలో రెపరెపలాడుతూ కాయితం. అందులో తండ్రి నుద్దేశించి సుస్మిత రాసిన రెండే రెండు వాక్యాలు— మమ్మీకి నేనంటే యిష్టం లేదు. అందుకే యింట్లోంచి వెళిపోతున్నాను. ఆ కాగితమ్ముక్క పట్టుకుని భర్త దగ్గిరకి పరిగెత్తింది.



"సుస్మీ... సుస్మీ.." అంటూ అతన్ని సుడిగాలిలా వాటేసుకుని బావురుమంది. జరిగినదేమిటో అర్థమై అతనికి మతిపోయింది. లుంగీమీద షర్టు తగిలించుకుని స్కూటరు తీసుకుని వూరిమీద పడ్డాడు. సుస్మిత ఫ్రెండ్స్ళ్లకీ తెలిసిన వాళ్లందరిళ్లకీ వెళ్లాడు.

కూతురు యింట్లోనే ఏ మూలో దాక్కుని తమని ఏడిపిస్తోందేమోనన్న ఆశతో వుత్పల యింట్లోనూ డాబామీదా మూలమూలలా వెతికింది. నిన్న వున్న కోపం, రాత్రి పశ్చాత్తాపం తగ్గాక కలిగిన బింకం యిప్పుడు లేవామెలో. వాటిస్థానే గుండెల్ని కోసేసే బాధ చోటు చేసుకుంది. ఎంత మూర్ఖంగా కొట్టింది దాన్ని? నెమ్మదిగానచ్చజెప్పాల్సింది. ఎవరిచ్చారు తనకలా కొట్టే అధికారం? దాని కోరిక తీర్చలేనపుడు కొట్టే అధికారం మాత్రం తనకెక్కడిది? ఎక్కడికెళ్లిందో, ఏం చేస్తోందో ఏడుస్తూ కూర్చుంది.

మధ్యాహ్నానికి తిరిగొచ్చాడు సుధీర్. ఆతృతగా అతని మొహంలోకి చూడబోయేంతలో అతని నిరాశ ఆమెని కమ్మేసింది.

"అంతటా వెతికాను. ఎక్కడా లేదు. రైల్వేస్టేషన్‌లోనూ బస్‌స్టాండులోను కూడా చూసాను. మీ అన్నయ్యకి ఎస్టీడీ చేసాను. అక్కడికి రాలేదట. నిన్న యింక్రిమెంట్ ఎరియర్స్ ఐదొందలొస్తే జేబులో పెట్టాను. అవి కూడా లేవు. పోలీస్ కంప్లయింటిద్దాం. దాని ఫోటో కావాలి.." అతని మాటలు వినిపించడం మానేసాయి వుత్పలకి. మెదడు మొద్దుబారిపోయింది. కళ్లముందు చీకట్లు!

"ఉత్పలా! వుత్పలా!" భర్త కంఠం ఎక్కడో దూరం నుంచి వినిపిస్తున్నట్లు వుంది. ఆ తర్వాత అది కూడా వినిపించడం మానేసింది.

* * *

సుస్మిత యింట్లోంచి బైటపడి నాలుగ్గంటలైంది. మొదట ఆమె రైల్వేస్టేషనుకెళ్లింది. హైదరాబాదు వెళ్లాలనుకుంది. అలా ఎందుకనిపించిందో ఆమెతే తెలీదు. టిక్కెట్టు కొనుక్కోవాలని తెలుసు. కౌంటరు ఎక్కడుందో తెలీదు. జేబులోంచి వంద రూపాయల నోటు తీసి చేత్తో పట్టుకుని అటూయిటూ తిరిగింది.

'హైదరాబాద్ వెళ్లడానికి టిక్కెట్టు ఎక్కడ కొనుక్కోవాలి?' ఎవర్నో ఇంగ్లీషులో అడిగింది.

ఆ వ్యక్తి సుస్మితని ఎగాదిగా చూసి 'హైదరాబాదుకా? ఇలా యివ్వు తెచ్చిపెడతాను' అని నోటు తీసుకుని జనంలో కలిసిపోయాడు. అతను తిరిగొస్తాడని ఎంతోసేపు ఎదురు చూసింది ఆ పిల్ల. ఎంతకీ రాకపోయేసరికి అతనికోసం స్టేషనంతా కలియ తిరిగింది. చూస్తుండగానే మూడు ట్రెయిన్స్ వెళ్లిపోయాయి. అతనికం రాడని అర్థమైంది. చిన్న జెర్క్!

ఈసారి మరో వందనోటు మార్చుకుని తిప్పలుపడి తనే టిక్కెట్టు కొనుక్కుని తెచ్చుకుంది. మళ్లీ ఏదో ట్రెయినొచ్చింది. ఎక్కి కూర్చుంది. ఆ పిల్ల ఒక్కర్తే ప్రయాణం చేస్తుండడం అందులోనూ స్కూల్ యూనిఫాంలో వుండడం చూసి చాలామంది కుతూహలంగావివరాలడిగారు.

అన్నీ అబద్ధాలే చెప్పింది సుస్మిత. అలా చెప్తుంటే తల్లిమీద ఏదో విజయం సాధించిన ట్టు సంతోషం కలిగింది.

ట్రెయిన్ కదలబోతుంటే మేగజేన్స్ బండి వచ్చింది చందమామ కొనుక్కుందా మనుకుంది సుస్మిత. పుస్తకం తీసి పట్టుకుం ది. రెండోచేత్తో డబ్బులకోసం జేబులో చెయ్యి పెట్టింది. వంద నోటొచ్చింది. అదివ్వకూడదనీ, యిందాకా మార్చిన చిల్లర లోంచి యివ్వచ్చనీ ఆమెకి తట్టలేదు. బండివాడు వందనోటు అందుకుని కావాల నే చిల్లర యివ్వకుండా జాప్యం చేసాడు.

ఒక క్షణం...

రెండు క్షణాలు...

ఒక నిముషం...

రెండు నిముషాలు...

"ఏయ్, నా ఛేంజి" అని సుస్మిత గోలపెడుతూనే వుంది. రైలు కదిలింది. పుస్తకాల బండివాడు ఆ పిల్లని హేళనగా చూస్తూ నవ్వాడు. కళ్ళనీళ్ళపర్యంతమైందామెకి.

చుట్టూ వున్నవాళ్లీ విషయాన్ని కాసేపు గొడవగొడవగా చెప్పుకున్నారు. ఆ తర్వాత మర్చిపోయారు. ఇది రెండో జెర్క్.

సుస్మితకి క్రమంగా అర్థమైంది. ఈ ప్రపంచంలో యింతమంది మనుషులున్నా ఒకరికొకరు ఏమీ కారని. తను ఆంటీ అని పిల్చిన ఎదుటి సీటులోని ముస్లిమ్ స్త్రీగానీ అంకుల్ అని పిల్చిన పక్కసీటతనుగానీ తనకేమీ చెయ్యరని గ్రహించింది. అందర్తో టీ మాట్లాడ్డం తగ్గించింది.

రైలు సికింద్రాబాద్ చేరేసరికి నాలుగు న్నరైంది. దార్లో ట్రాక్ రిపేరు, క్రాసింగ్స్ చేత బాగా ఆలస్యమైంది. సుస్మితకి రైల్లో ఆకలేసి నప్పుడల్లా ఏవో ఒకటి కొనుక్కుని తింది. వుత్పల అలా ఎప్పుడూ కొనుక్కుని తిననిచ్చేది కాదు. ఎప్పుడేనా దూరప్రయా ణం చేస్తే యింట్లోనే ఏవో ఒకటి తయారు చేసి పట్టుకెళ్లేది. సుస్మితకి యిప్పుడు ప్రతిదాంట్లోనూ తల్లిని డిఫీట్ చేసిన ఫీలింగ్ కలుగుతోంది.



## వంట

వంటలపోటీలో ఫస్టు వచ్చిన తాయారును ప్రశ్నించాడు విలేకరి "వంటలు చేయడం మీకు విసుగనిపించదా" అని

"ఆ... ఎందుకు అనిపించదండి. అందుకే నేను చేయను మా ఆయనే చేస్తారు" అంది గొప్పగా తాయారు.

– ఎస్.అప్పలరాజు
(నెల్లిమర్ల)

సికింద్రాబాదులో రైల్లోని చాలామంది దిగిపోతుంటే సుస్మిత కూడా దిగింది. ముందురోజు వేసుకున్న యూనిఫామేమో చీదరగా వుంది. బాగా మాసిపోయింది. జుత్తు రేగిపోయింది. మొహం కూడా అలసటకి వడిలింది. అసలే నలుపేమో, అలాంటి రూపంతో ఆ పిల్ల ప్లాట్‌ఫామ్ మీద వడుస్తుంటే యిద్దరు ముగ్గురు ముష్టిపిల్లలు వెంటపడ్డారు "నీ పేరేందే పోరీ" అని.

వాళ్లని చూస్తుంటే సుస్మితకి అసహ్యం వేసింది. ఇంగ్లీష్‌లో నోటికొచ్చినట్టు తిట్టింది. దాంతో వాళ్లు కొంచెం భయపడి దూరం తొలిగారు. టీసీకి టిక్కెట్టిచ్చి స్టేషను యివతలకొచ్చి నిల్చుంది సుస్మిత. పొద్దున్న వున్న వుత్సాహం ఆ పిల్లలో యిప్పుడేకోశానా లేదు. పైగా ఏదో గుబులుగా అనిపిస్తోంది. చీకటి పడుతోంది. అమ్మో! ఎక్కడికెళ్లి వుండాలి తను?! భయం భయంగా అనుకుంది.

వారం రోజులు ఎడాపెడా చూసిపారేసిన సినిమాలు గుర్తు చేసుకుని ధైర్యంగా బస్టాపులో నిలబడింది ఎక్కడికెళ్లాలో తెలీడం లేదు. బస్సు లొస్తున్నాయి. వెళ్తున్నాయి. వాటిని చూస్తూ నిల్చుంది.

ఏదేనా హోటలుకెళ్తే? ఎంతో పోష్‌గా వుండే ఆ హోటల్స్‌కి తనిలా వెళ్తే రానిస్తారా? మరిప్పుడేమిటి దారి? అంతా గజిబిజిగా అనిపిస్తోంది. చూస్తుండగానే చీకటి పడిపోయింది.

* * *

సుస్మిత ట్రెయిన్లోంచి దిగాక తనవెంట పడిన ముష్టిపిల్లల్ని యింగ్లీషులో చెడామడా తిట్టడం చాలామంది ఆగి చూసారు. అలా చూసినవాళ్లలో పార్థసారధి కూడా వున్నాడు. అతనూ ఆమె దిగిన ట్రెయిన్లోంచే దిగాడు. ఐతే సరిగా అదే సమయానికి బోంబే నుంచి మరో ట్రెయినొచ్చి ఎదుటి ప్లాట్‌ఫామ్‌మీద ఆగడంతో ఆమె బోంబేనుంచి వచ్చి వుండచ్చని వూహించాడు. అక్కడ బాంబుపేలుళ్లలో ఎంతో మంది పిల్లలు అనాథలయారు. ఈ పిల్లకూడా అంతే కావచ్చునమకున్నాడు. అతని మనసు జాలితో నిండింది.

స్టేషన్లోంచి యివతలికొచ్చేసరికి బస్టాపులో నిలబడి కనిపించింది సుస్మిత. అతన్లో ఒక ఆలోచన స్వార్థపూరితమైనదే కావచ్చు అది ఆ పిల్లపాలిట వరమైంది. లేకపోతే నిస్సహాయంగా రోడ్డుమీద మిగిలిపోయేది. ఇంకాసేపయాక ఏ చీకటికూపంలోకో నెట్టబడేది తిరిగి బయటపడే వీలులేకుండా దారులన్నీ మూసుకుపోయేవి.

పార్థసారధిది సామాన్యమైన కుటుంబం. భార్య కూడా వుద్యోగం చేస్తుంది. ముగ్గురు పిల్లలు. పెద్దపిల్లకి ఐదేళ్లు. తరువాతి యిద్దరూ కవల పిల్లలు. ఏణ్ణర్థం వయసువాళ్లు. పెద్దపిల్లని స్కూల్లో దించి, చిన్నపిల్లల్ని క్రెష్‌లో వదిలి భార్యాభర్తలిద్దరూ ఆఫీసు కెళ్లాలంటే రోజుకో యజ్ఞం చేసినంతౌతోంది. నమ్మకమైన దాదికోసం చూస్తున్నారు. ఇద్దరు ముగ్గురు పనిపిల్లల్ని తెచ్చిపెట్టుకున్నా, వాళ్లు యింట్లోంచి ఏవో తీసుకుని పారిపోవడం జరిగింది. ఈ పిల్లయితే అనాథగాబట్టి తమపంచనే పడుంటుందని భావించాడు.

సుస్మిత దగ్గరగా వెళ్లి "మా యింటికొస్తావా?" అని అడిగాడు. ఆమె అపనమ్మకంగా చూసి, వస్తానన్నట్టు తలూపింది. వెంటనే ఆటో మాట్లాడాడు. మిగతా వివరాలన్నీ తనే వూహించుకోవడం చేత పేరు మాత్రమే అడిగి వూరుకున్నాడు పార్ధసారధి.

అరగంట తర్వాత ఆటో ఒక చిన్న డాబా ముందు ఆగింది. ముందు పార్ధసారధి దిగాడు. వెనక బెరుగ్గా దిగింది సుస్మిత. అదే క్షణాన్న తమిల్లు గుర్తొచ్చింది. ఆటో దిగగానే ఎంత స్వతంత్రంగా పరిగెత్తేది తమ యింట్లోకి.

"రామ్మాయ్" ఆటోకి పైసలిచ్చి చెప్పాడు పార్ధసారధి. ఇలా గేటు తీసాడో లేదో బిలబిల్లాడుతూ యింట్లో వాళ్లంతా యివతలికొచ్చేసారు. ముగ్గురుపిల్లలకీ తలో యాపిలూ యిచ్చి, బేగ్ భార్య చేతికిచ్చి లోపలికి నడిచాడు. సుస్మిత అతని వెనకాలే వెళ్లింది.

"ఇదో, కొత్త పనిపిల్లని తీసుకొచ్చాను" భార్యకి చెప్పాడు.

"ఇదా?" వెనక్కి తిరిగి సుస్మిత మురికి బట్టలకేసి చింపిరిజుత్తుకేసీ అసహ్యంగా చూస్తూ అంది.

'రైల్వేస్టేషన్లో దొరికితే తీసుకొచ్చాను'.

"ఇలాంటి ముండల్నెందుకు తీసుకొస్తారు? వీళ్లు పనీపాటా చెయ్యరు. తేరగా వస్తే మెక్కుతారు. ఐనా, అడుక్కుతినే వెధవలకి యింట్లో పీడపట్టుని వుండమంటే ఎందుకు బావుంటుందీ?" పార్ధసారధి భార్యపేరు నాగమణి. నల్లగా పొడుగ్గా రివటలా వుంటుంది. కాస్త నోరెక్కువ. అది పెట్టుకునే చాలా పనులు సాధించుకొస్తుంది.

"నాలుగు రోజులుంచుకుని నచ్చకపోతే తగిలేద్దాం. నువ్వు చెప్పిన వైపు కాదు. బొంబాయి నుంచి వచ్చింది" సర్దిచెప్పాడు పార్ధసారధి.

"నీ పేరేంటే?" అంతదాకా మౌనంగా వాళ్ల సంభాషణ వింటున్న సుస్మిత ఆ ప్రశ్నకి వులిక్కిపడింది.

## బాలమేధావులు



విశ్వవిఖ్యాత సంగీతవేత్త 'మోజార్ట్' తన 4వ ఏటనే సంగీత స్వరకల్పన చేశాడు. జర్మనీలో 'క్రిస్టియన్ హానేకర్' అనే కుర్రాడు మూడేళ్లకే మాతృభాషతోపాటు గ్రీకు, లాటిన్, ఫ్రెంచి భాషలు నేర్చుకున్నాడు. సోవియట్‌కు చెందిన 'తారాన్ చెర్నియన్ కో' అనే కుర్రాడు 14 నెలల వయస్సులోనే వార్తాపత్రికలను చదివాడు. బాల మేధావులకు ప్రథమ స్థానం భారతదేశానిదే.

– డాక్టర్ ఆళ్ల

"సు... సుస్మిత" తపీమని చెప్పింది. నేను పనిపిల్లని కాను, నీలాంటి ఓ అమ్మ కూతుర్నని చెప్పాలనుకుందిగానీ మాట పెగిలిరాలేదు.

"ఏ వూరు మీది?"

"నీకు అమ్మా, నాన్నా లేరా?"

"మీ నాన్నేం చేసేవాడు?"

అబద్ధాలు చెప్పడంలో పొద్దున్న వున్న సరదా యిప్పుడు లేదు సుస్మితకి. ఒక్క ప్రశ్నకీ జవాబివ్వలేదు. కళ్లలోంచి నీళ్లు వుమికి వస్తున్నాయి. ఆ కన్నీళ్లని చూసి మరోలా అర్థం చేసుకుంది నాగమణి.

"సర్లే! పో! పోయి బాత్రూంలో అంటు న్నాయి. అవి తోమి బాత్రూం కడిగి శుభ్రం చెయ్యి. స్నానం చేసి రా. ఇంకో గౌనుందా నీకు?.. ఏమీ నీతో తెచ్చుకోలేదా ? నాదో పాతలంగా యిస్తాను అది కట్టుకుని నీ బట్టలుతుక్కుని ఆరేసుకో. పో...' అంది నాగమణి బాత్రూంకి దారి చూపిస్తూ.

చేతయ్యి కాక అంట్లన్నీ తోమింది సుస్మిత. వదలినివన్నీ మళ్లీమళ్లీ తోమించింది నాగమణి. ఒకవైపు చలి వణికిస్తున్నా టేంకు లోని చన్నీళ్ల స్నానం చేసి ఆవిడిచ్చిన లోలంగా జాకెట్టు వేసుకుని భోజనానికి బాత్రూం ముందున్న ఖాళీస్థలంలో కూర్చు ంది సుస్మిత. అల్యూమినం పళ్లెంలో పొద్దుటి అన్నం, యింత పచ్చడివేసి, ఒక్క పిసలు కూర విదిపి లోపలికెళ్లిపోయింది నాగమణి.

సుస్మితకా అన్నం తినబుద్ధికాలేదు. బొంబాయినుంచి వచ్చిన అనాథనైతే మాత్రం యింత నిర్దయగా చూస్తారా? కళ్లలోంచి నీళ్లు ధారాపాతంగా కారిపోతున్నాయి. అమ్మ తన నెప్పుడూ యింత నిర్దయగా చూడలేదు. తనెంత అల్లరిచేసినా చిరునవ్వుతో సహించిం ది. అల్లరి మరీ హద్దులు దాటిపోతేనే కొట్టేది. తను చేసింది తప్పుకాదూ? వెక్కిళ్లొస్తున్నాయి.

రమ్యా వాళ్లూ తననేమంత బాగా చ.. రని? వీసీపీ కొనుక్కున్న రోజు వాళ్ల మధ్య కూర్చోబెట్టుకుని తనకీ ఐస్క్రీమ్ కప్పిచ్చారు. రెండో రోజున వాళ్ల మధ్య కూర .. బోతే, నువ్విక్కడ కాదు, అక్కడ— అని కుర్చీ చూపించారు. చూస్తుండగా హాలం.. నిండిపోయింది. ఇంకెవరో వస్తే తనని కుర్చీంలోంచి లేపి కింద.. కూర్చోబె ట్టారు. తన ఫ్రెండు రమ్య తనకేసి దొంగచూపులు చూస్తూ సోఫాలో కూర్చుం ది. అలా.. టప్పుడు తనెందుకు వాళ్లింటికె ళ్లాలి? అం..కే కదూ, అమ్మ కొట్టింది? సుస్మితకి ఏ.. పోగలేదు. మోకాళ్ల ముడుచు కుని అందు.. ముఖం దాచుకుని వెక్కివె క్కి ఏడ్చింది.

"ఎందుకే ..స్తున్నావు? అన్నం కూడా తినలేదు? .. !" నాగమణి కఠోరమైన స్వరం వినిపిం..కా అలా ఏడుస్తూనే వుంది. ఆవిణ్ణి .. సాక నెమ్మదిగా పరికిణీ అంచుతో కళ్లు .. ..చుకుంది.

"ఊ తిను" క్కడే నిల్చుంది నాగమ ణి. అన్నాన్ని గబగ.. ముద్దలు చేసి మింగింది సుస్మిత. తర్వాత పళ్ళెం, గ్లాసు కడిగి తెచ్చుకుని ఒక వారగా బోర్లించింది.

"ఈవేళ్టికి పడు..కో. పొద్దునే నాలుగింటి కి లేపుతాను. తెలి..ందా? అని ఒక చాప, దిండు, కప్పుకోవడా..నికో దుప్పటీ యిచ్చి,

ముందు గదిలో పడుకోమని లోపలికెళ్లి తలుపు గొళ్ళెం పెట్టుకుంది నాగమణి.

పక్క బట్టలు చీదరపుట్టిస్తున్నాయి.

వంటిమీది బట్టలు చీదర పుట్టిస్తున్నాయి

నాగమణి కఠోరమైన గొంతు చీదర పుట్టిస్తోంది.

అన్నీ కలిపి సుస్మిత చిన్ని మనసుమీద తమ ప్రతాపం చూపుతున్నాయి. ఎప్పటికో నిద్రలోకి జారుకుంది. జారుకునేముందు ఒక నిర్ణయానికొచ్చింది. చాలా తెలివైన నిర్ణయమది.


కొత్తచోటు కావడం చేత తెల్లారి మూడింటికే మెలకువ వచ్చేసింది సుస్మితకి. తలుపు తీసుకుని వెళ్లి తడితడిగా వున్న బట్టల్ని తొడుక్కుని విడిచిన బట్టల్ని ఒక వార కుప్పగా పెట్టింది. నిశ్శబ్దంగా గేటు తీసుకుని బయటికి నడిచింది.

రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. కుక్కల అరుపులు వినిపిస్తున్నాయి. సందు చివరున్న చెత్తకుండీ పక్కని ముడుచుకుని కూర్చుంది తెల్లారేదాకా. తెల్లారాక సంధించిన బాణంలా బస్టాపుచేరుకుంది.

* * *

అప్పటికి రెండోరోజు సుస్మిత యింట్లోంచి వెళిపోయి. ఏడ్చింది ఏడ్చినట్టే వుంది పుత్పల. పచ్చిమంచినీళ్ల కూడా గొంతుకలో పోసుకోలేదు. సుస్మిత నాయనమ్మ, తాత, అమ్మమ్మ, మేనమామలు, పినతండ్రి అందరూ వచ్చేసారు. అందరూ తలోవైపు జీపుల్లోనూ ప్రైవేటు టాక్సీల్లోనూ వెళ్లి వెతుకుతున్నారు. బేంకులో వున్నదంతా డ్రాచేసి అందినచోటల్లా అప్పుచేసి డబ్బు నీళ్లల్లా ఖర్చుపెడుతున్నాడు సుధీర్.

"ఒక్క మెతుకు నోట్లో వేసుకోమ్మా! విండింట అభోజనంగా వుండకూడదు" మనవరాలి కోసం ఏడుస్తూనే కూతుర్ని బతిమాలుతోంది పుత్పల తల్లి. ఆవిడ వాళ్లోపడి బావురుమంది పుత్పల.



"దీనికి నేనేం లోటు చేసానమ్మా? వలుగరేసి పిల్లల్ని మీరు మేంచి పెద్దచేసారు. ఒక్కపిల్లని పెంచడం చేతకాక చేతులు కాల్చుకున్నాం అడిగింది.

"అదేవమ్మా మీకూమాకూ వున్న తేడా. ఒక్క పిల్లని అడిగినవన్నీ యిచ్చారు. అది కొండమీది కోతిని తెమ్మనేరికి ఇలా పోయారు. మొదటే అదుపులో పెడితే యింతదాకా వచ్చునా?" వుత్పల అత్తగారంది.

"సూటిపోటి మాటలనడానికి యిదేనా తరుణం వదినా?" గుడ్ల నీళ్ల కక్కుకుంటూ అడిగింది వుత్పల తల్లి.

"నేనేం కాని మాటన్నానమ్మా వదినా? పసిది ఎక్కడుందో! ఎలా ఏడుస్తుందో! ఆకలికి ఒక్క క్షణం కూడా ఆగలేకపోయేది. ఏ సెలవలకేనా మా వూరొస్తే దీనికోసమని ఎనిమిదింటికల్లా వండి పెట్టేదాన్ని. ఎలా వుందో!" వుత్పల అత్తగారు చీరచెంగుతో ముఖం కప్పుకుని రోదించసాగింది.

"ఆ వీసీపీ ఏదో కొనిపడెయ్యి నాయనా! ఎప్పుడో నేను చచ్చిననాడు వాటాలేసి యిచ్చే బంగారమేదో యిప్పుడే యిస్తాను. నా గుల్లపేరు యిస్తాను. అమ్మేసెయ్యి. అసలా దేవుడి దయవల్ల అది తిరిగి రావాలేగానీ... "కొడుకుతో అందావిడ. సుధీర్ తల్లి చేతులు రెండూ అందుకుని తన కళ్లమీద వేసుకున్నాడు. ఎంతో సాంత్వనగా అనిపించింది.

"వెర్రి తండ్రీ! నీ బాధ నాకు తెలీదేమిట్రా?" ప్రేమగా అందావిడ.

మధ్యాహ్నం మూడైంది. తెలిసినవాళ్లొచ్చి పలకరించి వెళ్తున్నారు. చుట్టుపక్కల వూళ్లకి వెళ్లిన సుధీర్ తమ్ముడు, బావమరదులు తిరిగొచ్చారు. మొహాలు వేళ్లాడేసుకుని వచ్చినవాళ్లని చూసి వుత్పల మరింత నిస్త్రాణపడింది.

"అదిగో వచ్చింది" అన్నారెవరో.

అందరూ ఒక్కసారి వీధికేసి చూసారు. తలొంచుకుని తప్పుచేసినట్టు బిత్తర చూపులు చూస్తూ... ఒక్కొక్క అడుగూ వేస్తూ వస్తోంది సుస్మిత.

"సుస్మీ!" చేతులు చాపుతూ బిగ్గరగా ఏడ్చింది వుత్పల. ఆ చేతుల్లో పరుగున వెళ్లి వాలిపోయింది సుస్మిత.

వెచ్చటి అమ్మ కౌగిలి! సంతోషంతో కొట్టుకుంటున్న గుండె చప్పుడు. ప్రేమతో వొళ్లంతా తడుముతున్న స్పర్శ! సుస్మితకిప్పుడు పూర్తిగా అర్థమైంది. తను, అమ్మ వేరువేరు కాదని, తన వంటిమీద పడ్డ దెబ్బ అమ్మ గుండెమీద కూడా పడుతుందని!

*

